క్లుప్తంగా

పలు సమస్యలపై డీఎల్‌పీఓ విచారణ



సుంకరపాలెం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీఓ అన్నామణి

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై డీఎల్‌పీఓ అన్నామణి మంగళవారం విచారణ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలపై డీఎల్‌పీఓ అంశాల వారీగా విచారణ చేపట్టారు. దీనికి సంబంధించి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు, లచ్చిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు మోపూరి వెంకట రెడ్డినాయుడు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ వీజేవీ రమణ, పంచాయతీ కార్యదర్శులు వలీబాబా, జ్యోతిసుధ ఉన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2025–26 వివిధ ట్రేడుల్లో కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు మంగళవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక ఏడాది కోర్సులైన స్త్రీ అభ్యర్థుల కోసం కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, పురుష అభ్యర్థులకు రెండేళ్ల కోర్సులైన మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకుంటామన్నారు. శిక్షణాకాలంలో ప్రతినెలా రూ.వెయ్యి స్టైఫండ్, ఉచిత పుస్తకాలు,యూనిఫాం, షూ, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్‌లు ఉంటాయన్నారు. శిక్షణ ముగించుకున్న విద్యార్థులకు స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిషిప్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సెంటాక్ పుదుచ్చేరి.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు 9491441164, 0884–2951001కు ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనాథలు, దివ్యాంగులకు వితరణ

అమలాపురం టౌన్: సరస్వదమ్మ ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కామాక్షీ పీఠంలోని అనాథ పిల్లలకు, హరి మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు ఆ ట్రస్ట్ ప్రతినిధులు మంగళవారం పండ్లు పంచారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి టీఎస్ఎన్ మూర్తి పుట్టిన రోజు సందర్భంగా ఈ వితరణ కార్యక్రమాలు చేపట్టినట్లు ట్రస్ట్ ప్రతినిధి నాతి శ్రీనివాసరావు తెలిపారు. అనాథ పిల్లలు, మానసిక దివ్యాంగుల సమక్షంలో మూర్తి పుట్టిన రోజు వేడుకలను ట్రస్ట్ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ట్రస్ట్ సభ్యులు తాళ్ల సాంబమూర్తి, బొక్కా నాని, అరుణ్, కృప పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న సావిత్రినగర్ యువకులు

యానాం: ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు చేసే రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలో తీరప్రాంత గ్రామమైన సావిత్రినగర్‌లో సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని నందమూరి అభిమాన సంఘం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడారు. అనంతరం 52 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మసకపల్లి బుజ్జి, మల్లాడి విఘ్నేష్, సంగాడి సత్తిబాబు, దోమ వీర్రాజు, వనమాడి మాతరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

అమలాపురం రూరల్: ఏపీ ఈఏపీ సెట్ అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. బైపీసీ, అగ్రికల్చర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. భట్లపాలెంలో బీవీసీ కళాశాలలో రెండు విడతలుగా 399 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 22 మంది హాజరు కాలేదని పరీక్షల నిర్వహణ కోఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

అమలాపురం టౌన్: తన భర్తతోపాటు అత్తింటి వారు తనను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నారని అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన పులిమే దుర్గాసూర్యకుమారి (32) పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. భర్త తూము వీర మణికంఠతో పాటు వారి అత్తింటి వారిపై ఇచ్చిన ఫిర్యాదుపై విచారిస్తున్నామన్నారు. మణికంఠ, సూర్యకుమారికి ఏడేళ్ల క్రితం వివాహమైంది.

మురుగు పారదు.. ముప్పు తప్పదు

- రైతుల పాలిట శాపంగా మారిన డ్రెయిన్లు
- దశాబ్దకాలంగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఏటా వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- ఆక్రమణదారుల చేతులో చిక్కిశల్యం



ముమ్మిడివరం డ్రెయిన్లలో ముంపునీరు దిగేందుకు అవరోధంగా ఉన్న గుర్రపు డెక్క



పూడికలతో కుంగిన కొమానపల్లి-గాడిలంక మైనర్ డ్రెయిన్

ముమ్మిడివరం: మురుగు నీటి కాలువలు ఆక్రమణకు గురై, పూడుకుపోయి రైతుల పాలిట శాపంగా తయారయ్యాయి. ఆక్రమణలకు గురై తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోయి మురుగునీరు దిగేందుకు అవరోధంగా ఉన్నాయి. దీని ఫలితంగా ఏటా వేలాది ఎకరాలు ముంపుబారిన పడి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. 1991–92లో ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రధాన మురుగునీటి కాలువలను ఆధునీకరించారు. ఆపై తాత్కాలిక మరమ్మతులు తప్ప శాశ్వత చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. డ్రెయిన్లకు అనుసంధానంగా ఉన్న అవుట్‌పాల్ స్లూయిజ్ నుంచి నీరు డ్రెయిన్లలోకి ఎగదన్ని పంట చేలను ముంచెత్తుతున్నాయి.

ఏటా తప్పని ఇబ్బందులు

ఏటా కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో వేలాది ఎకరాలు ముంపుబారిన పడుతున్నాయి. ముమ్మివరం మండలంలో డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో సుమారు 1,500 ఎకరాలు, కాట్రేనికోన మండలంలో 1,370 ఎకరాలు, ఐ.పోలవరం మండలంలో 2,000 ఎకరాలు, తాళ్లరేవు మండలంలో 1000 ఎకరాలు ఏటా ముంపు బారిన పడి ఆయా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో రెండు ప్రధాన మురుగనీటి కాలువలు, ఏడు మధ్యతరహా మురుగునీటి కాలువలు, 89 మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ప్రధాన మురుగునీటి కాలువలు 35 కిలోమీటర్లు, మధ్యతరహా మురుగునీటి కాలువలు 57 కిలోమీటర్లు, చిన్నతరహా మురుగునీటి కాలువలు 280 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో పూర్తిగా, ఉప్పలగుప్తం మండలాల్లో కొంత భాగం కలిసి సుమారు 40వేల ఎకరాల్లో మురుగు నీటిని సముద్రంలోకి మళ్లించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. అంతేకాకుండా 30వేల ఎకరాల్లో కొబ్బరితోటలు, 12వేల ఎకరాల్లో ఆక్వా చెరువుల్లో మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఇవే ఆధారం.

ఆక్రమణలు.. కుంగిన గట్లు

అమలాపురం–అయినాపురం, వృద్ధ గౌతమీ ప్రధాన మురుగు నీటి కాలువ, బోండాయి కోడు, అయినాపురం, ముమ్మిడివరం మధ్య తరగతి కాలువలు ఆక్రమణలకు గురవ్వడంతో పలుచోట్ల గట్లు కుంగిపోయి ముంపునీరు చేలను ముంచెత్తుతోంది. గతంలో డెల్టా ఆధునీకరణలో భాగంగా లక్షల వ్యయంతో కొన్ని మైనర్ డ్రెయిన్లలో తూతూ మంత్రంగా పూడికతీత పనులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. మేజర్ డ్రెయిన్లు ఆధునీకరించకుండా మైనర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టినా ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయిన్లు ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏటా ముంపు తప్పడం లేదు



అయినాపురం–అమలాపురం ప్రధాన మురుగునీటి కాలువ అనుకుని గోదావరి ఏటిగట్టుకు ఉన్న అవుట్ పాల్ స్లూయిస్ వల్ల ఏటా ముంపు తప్పడం లేదు. వరదలు, వర్షాలు వచ్చిన సమయంలో మురుగునీరు గోదావరిలో దిగక ఎగువన ఉన్న ముంపు నీరు గ్రామాన్ని ముంచెత్తుతోంది. సుమారు 2వేల ఎకరాలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. డ్రెయిన్లు ఆధునీకరణకు చర్యలు చేపట్టాలి.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

పూడికలు తొలగించాలి



మురుగునీటి కాలువలు తూడు, గుర్రపు డెక్కతో పూడుకుపోయాయి. దీంతో ముంపు నీరు దిగేందుకు వీలు లేదు. తరచూ పంట చేలు ముంపు బారిన పడుతున్నాయి. డ్రెయిన్లలో పూడికలు తొలగించాలి. మురుగు కాలువల గట్లు బలపర్చాలి. ఏటా పంట దిగుబడులను కోల్పోతూ ఆర్థికంగా నష్టపోతున్నాం.

కె.శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

హనుమాన్ విజయోత్సవ శోభాయాత్రకు ఏర్పాట్లు



శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: హిందూ యువతకు సనాతన ధర్మంపై అవగాహన పెంచే దిశగా హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ సంయుక్త ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ శోభా యాత్ర (బైక్ ర్యాలీ)ను ఈనెల 22వ తేదీ సాయంత్రం 3 గంటలకు అమలాపురంలో నిర్వహించనున్నారు. స్థానిక సుభద్ర కంటి ఆస్పత్రి ప్రాంగణంలో వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ జిల్లా శాఖల ప్రతినిధులు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శోభాయాత్ర విషయాలను వివరించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో 216 జాతీయ రహదారి చెంతన గల విజయ త్రిముఖ గణపతి ఆలయం నుంచి గురువారం 3 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమై 6 గంటల వరకూ కొనసాగుతుందన్నారు. కోనసీమ వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది హిందువులు పాల్గొనే ఈ శోభాయాత్రకు మారుతీ జీయర్ దాసి స్వామిజీ, పరబ్రహ్మ నందగిరి మాతాజీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర సత్సంగ్ ప్రముఖ్ రాళ్లపల్లి పాపయ్యశర్మ, జిల్లా సీనియర్ వీహెచ్‌పీ నేతలు డాక్టర్ అయ్యగారి వెంకటేశ్వరరావు, బజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, యాత్ర నిర్వహణ కమిటీ ప్రతినిధి కాళ్లకూరి కుమార్, వీహెచ్‌పీ నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య శోభాయాత్ర ఏర్పాట్లను వివరించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు యక్కల బ్రహ్మేష్, ఉపద్రష్ట శ్రీరామ్, యాత్ర నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర కరపత్రాలను వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ప్రతినిధులు ఆవిష్కరించారు.

విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం



బండారులంకలో మిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మమ్మీ

అమలాపురం రూరల్: పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికి జిల్లా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మమ్మీ అధికారులను ఆదేశించారు. అమలాపురం మండల వనరుల కేంద్రాన్ని, బండారులంకలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధ కృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. 2025–26 అకాడమిక్ సంవత్సరానికి రావలసిన స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సరఫరా అయిన ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, డిక్షనరీలను, సురక్షిత ప్రదేశంలో స్టోర్ చేయాలన్నారు. జిల్లాలోని 6 నుంచి 18 ఏళ్ల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను సేకరించి వారిని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ సరేళ్ల దుర్గాదేవి, బండారులంక భవిత సెంటర్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సీఆర్‌పీ జి .నాగన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఆమోదం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి వెల్లడి



యానాం వెంకన్న సన్నిధిలో వివరాలను వెల్లడిస్తున్న మల్లాడి

యానాం: భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా రెండవ ఫేజ్ నిర్మాణ పనులకు మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ సమావేశం ఆమోదం తెలిపిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మల్లాడి కృష్ణారావు తెలిపారు. మంగళవారం యానాంలో ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. రెండవ ఫేజ్‌కు రూ.9.3 కోట్ల ఖర్చు అవుతుందని ఇందులో సుమారు రూ.5.50 కోట్ల వరకు పనులను మాత్రమే టీటీడీ బోర్డు ఆధ్వర్యంలో చేస్తారని మిగిలిన పనులను యానాం వెంకన్న దేవస్థానం కమిటీ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అయిదున్నర కోట్లలో మొదటి దశగా టీటీడీ దేవస్థానం రూ.1.90 కోట్లు ఇస్తున్నారని ఆయన తెలిపారు. జూన్ 20 తేదీలోగా రూ.3.60 కోట్లు టీటీడీ దేవస్థానానికి డిపాజిట్ చేస్తే రూ.1.90 కోట్లను దాతల అకౌంట్ నుంచి దేవస్థానానికి డిపాజిట్ చేసేలా టీటీడీ బోర్డు సమావేశంలో నిర్ణయించారన్నారు. మొదటి ఫేజ్‌లో చాలా మంది దాతలు ఇప్పటి వరకూ రూ.17,83,756 భక్తులు, దాతలు విరాళాలు ఇచ్చారన్నారు. ఇంకా నిర్మాణానికి రూ.7.13 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. మొదటి ఫేజ్‌లో నిర్మాణంతో పాటు శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.3కోట్లు ఫండ్ అందించారన్నారు. యానాం దేవస్థానం టీటీడీ బోర్డుకు రూ.2.71 కోట్లు ఫస్ట్‌ఫేజ్‌లో జమ చేసినట్లు తెలిపారు. మొదటి దశకు రూ.7కోట్లు ఖర్చు అయిందన్నారు. దీనిలో టీటీడీ నుంచి రూ.3 కోట్లు, రూ.4 కోట్లు దాతల నుంచి అందిందన్నారు. రెండవ దశ నిర్మాణానికి పుదుచ్చేరి ప్రభుత్వం సహకరించాలని కోరితే వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించడానికి అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తీర్థం

యానాం: యానాం పట్టణంలో కొలువైన శ్రీపోలేరమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

పలువురు ఎస్సైలకు బదిలీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా పలువురు ఎస్సైలను బదిలీలు చేస్తూ మంగళవారం రాత్రి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, పుదుచ్చేరి సుభమ్‌ఘోష్ ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి సీసీఆర్ విభాగంలో ఉన్న ఎస్సై కట్టా సుబ్బరాజును యానాం స్టేషన్‌కు బదిలీ చేశారు. అదే విధంగా మరో ఏడుగురికి బదిలీ ఉత్తర్వులు వచ్చాయి.

అంతర్జాతీయ మానవ వనరుల దినోత్సవం

అమలాపురం రూరల్: వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో భట్లపాలెంలో బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మానవ వనరుల దినోత్సవం నిర్వహించారు. మానవ వనరుల శాఖ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్రను క్లబ్ అధ్యక్షుడు అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించినట్టు తెలిపారు. క్లబ్ సభ్యులు పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, వలవల నాయుడు, యరమ్రిల్లి సత్యనారాయణమూర్తి, పుత్స కృష్ణ కామేశ్వరరావు, పచ్చిగోళ్ళ చిన రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలి



నడిపూడి వద్ద వంతెన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లా కేంద్రంలో వాహనాల రాకపోకల రద్దీని నియంత్రించేందుకు యుద్ధ ప్రాతిపదికన నడిపూడి లాకులు ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రహదారులు భవనాల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం అమలాపురం మండల పరిధిలోని ఈదరపల్లి, నడిపూడి లాకు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల నిర్వహణ తీరుతెన్నులను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ నిర్దేశిత నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యాలకు తావివ్వరాదని ఆయన స్పష్టం చేశారు. వంతెన వసతులను జిల్లా వాసులకు అందుబాటులోకి తీసుకొని వచ్చి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని ఇంజనీర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో రహదారుల భవనాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము డివిజనల్ ఇంజనీర్ వర్మ, జూనియర్ ఇంజనీర్ రమేష్, తహసీల్దార్ పలివెల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పలు డిమాండ్ల సాధన కోసం అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న పలు ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: కార్మికుల మెడకు ఉరి తాడైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలు ప్రజా సంఘాల ప్రతినిధులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ నిరసన ప్రదర్శన చేపట్టి తమ డిమాండ్లను తక్షణమే కేంద్ర ప్రభుత్వం తీర్చాలని నినాదాలు చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కేంద్రంలో తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు పరిశ్రమల యాజమాన్యాలకు, కార్పొరేటర్లకు లాభదాయకమని విమర్శించారు. ఈ ధర్నా, నిరసన ప్రదర్శన కార్యక్రమాల్లో పలు ప్రజా సంఘాల ప్రతినిధులు బీర ఎస్తేరు రాణి, మలకా సుభాషిణి, పీతల రామచంద్రరావు, పి.శివ, జి.దైవ కృప పాల్గొన్నారు.

కాకినాడలో నేడు, రేపు జాబ్ మేళా

అమలాపురం రూరల్: ప్రపంచ ప్రసిద్ధి చెందినా టాటా మల్టీనేషనల్ కంపెనీ హైదరాబాద్ కంపెనీలో ఉద్యోగాల భర్తీకి ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో బుధవారం ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన మల్టీనేషనల్ కంపెనీ ఎల్ అండ్‌టీ, కాంచీపురం కంపెనీ ఉద్యోగులకు ఐటీఐ చదివిన అభ్యర్థులు కాకినాడ ప్రభుత్వ గురువారం ఉదయం 9.30 గంటలకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో కాకినాడలో ప్రభుత్వం ఐటీఐలో హాజరు కావాలన్నారు.

26న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల పరిశీలన

అమలాపురం రూరల్: కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 26న దగ్గరలో ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలని అంబేడ్కర్ కోనసీమ కాకినాడ జిల్లాల అడ్మిషన్స్ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ వర్మ తెలిపారు. కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, అమలాపురంలో జిల్లా ఉపాధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఆన్‌లైన్ నమోదు పత్రంతో వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు.

2న ధ్రువపత్రాల పరిశీలన

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎల్‌డీసీ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లో వెయిటింగ్ లిస్ట్ అభ్యర్థులుగా ఉన్న వారికి వచ్చే నెల 2న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీపీఅండ్ ఏఆర్ శాఖ కార్యదర్శి విజయశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు పుదుచ్చేరి సెక్రటేరియట్, మూడవ ఫ్లోర్, కాన్ఫరెన్స్‌హాలులో ఉదయం 10.30 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఆదిలక్ష్మి అమ్మవారి జాతర

ఉప్పలగుప్తం: గ్రామంలో వేంచేసి ఉన్న ఆదిలక్ష్మి అమ్మవారి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమార్చనలు చేసి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ముమ్మిడివరంలో మినీ మహానాడు

ముమ్మిడివరం: స్థానిక డీఎల్‌ఎఫ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం టీడీపీ మినీ మహానాడు నిర్వహించింది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. ప్రజల అవస్థ



సుంకరపాలెం పంచాయతీ పితానివారిపేటలో వర్షం నీటిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వరకు కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో మోకాలిలోతు నీటిలో రాకపోకలకు జనం అవస్థలు పడ్డారు. సుంకరపాలెం పంచాయతీ పితానివారిపేటలో డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం నీరు రహదారిపై నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి వర్షం నీరు ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేసారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

డిమాండ్ల పరిష్కారం కోరుతూ ధర్నా



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వివిధ సంఘాల సభ్యులు

తాళ్లరేవు: పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ వివిధ సంఘాల కార్మికులు ధర్నా నిర్వహించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసారు. కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ స్కీం వర్కర్స్ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు,, ఆర్.నాగలక్ష్మి, పి.అనంతలక్ష్మి, విమలాదేవి, విజయలక్ష్మి, గణితమ్మ, కళావతి పుష్పావతి, శారదాదేవి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

వీఏఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో 41 విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్ల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ప్రత్యేక అధికారి కులొంగొత్తన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను రాతపరీక్ష ఆధారంగా భర్తీ చేస్తారని పోస్టుల వివరాలు, రిజర్వేషన్లు, విద్యార్హతలు, పరీక్ష విధానం, ఎంపిక తదితర వివరాలను డీఆర్అండ్ ఏఆర్ పోర్టల్‌లో 'రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. దరఖాస్తులు స్వీకరణ మే 22 నుంచి ఉంటుందని, జూన్ 21తో ముగుస్తుందన్నారు.

రక్తదానం

అమలాపురం టౌన్: సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు స్థానిక వెంకటరమణ థియేటర్ వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ రాష్ట్ర అభిమానుల సంఘం కన్వీనర్ రాయుడు బాబ్జి, కొపనాతి వెంకటరాజు, మట్టపర్తి రాము పాల్గొన్నారు.

ఉప్పనీరు కట్టడికి చర్యలు తీసుకుంటాం

అల్లవరం: పంట భూముల్లోకి ఉప్పు నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని డ్రెయిన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ తెలిపారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నంలో మంగళవారం ఈఈ కిషోర్ తహసీల్దార్ నరసింహారావు పంట చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ కిషోర్ పంచనది డ్రెయిన్ నుంచి పంట చేలల్లోకి ఉప్పు నీరు రాకుండా కలెక్టర్‌కు వివరించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ రాపాక విజయలక్ష్మి, తహసీల్దార్ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీను, వీఆర్వో సతీష్, రైతులు పాల్గొన్నారు.